తల్లికి వందనం ఎప్పుడిస్తారు?



టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా తల్లివందనం అమలు చేస్తామని చెప్పింది. ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఏటా రూ.15వేలు ఇస్తామన్నారు. ఇప్పటికీ అతీగతీలేదు. దాని ప్రస్తావనే లేదు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూ.30వేలు రావాలి. ఇంత మోసం చేస్తారని అనుకోలేదు.

–సీహెచ్.ఝాన్సీ, కొంతమూరు

మహిళలకు రూ.1,500 ఇవ్వాల్సిందే



మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని ప్రచారం హోరెత్తించారు. ఎన్నికల వేళ ప్రతి సభ, సమావేశంలో కూటమి నేతలు సూపర్‌సిక్స్ అంటూ ఊదరగొట్టారు. తీరా అందలం ఎక్కాక ఆ ఊసే లేకుండా పోతోంది. హామీలు ఇచ్చాక మరిచిపోతే ఎలా...నాతో పాటు మహిళలందరూ రూ.1,500 ఎప్పుడిస్తారా అని ఎదురుచూస్తున్నారు.

–ఎం.వెంకటలక్ష్మి, కవలగొయ్యి

రూ.15,000 ఎప్పట్నుంచి ఇస్తారు



తల్లికి వందనం పేరిట ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15వేలు చొప్పున ఇస్తామని కూటమి అభ్యర్థులు చెప్పారు. అధికారంలోకొచ్చారు. కానీ ఇప్పటి వరకు అసలా పథకం ఎప్పట్నుంచి ప్రారంభం అవుతుందన్నది కూడా స్పష్టత ఇవ్వడం లేదు. అసలు అమలు చేస్తారా? చేస్తే ఎప్పట్నుంచి చేస్తారు? ఆలస్యం వల్ల పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువుపై దాని ప్రభావం పడుతుంది.

– పువ్వుల లక్ష్మి, శాటిలైట్ సిటీ

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పింది. అధికారంలోకి యాభై రోజులైపోయింది. కానీ ఇంతవరకు ఆ హామీ ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల్లో ప్రజలకు చెప్పినట్టు ఉద్యోగాలైనా కల్పించాలి. లేకపోతే నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి. లేకపోతే నిరుద్యోగులు కూటమి ప్రభుత్వంపై తిరగబడతారు.

– దేవులపల్లి సరితారాణి, ధవళేశ్వరం

బాబూ ష్యూరిటీ... మోసం గ్యారంటీ

నాడు నేనున్నానంటూ భరోసా



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా రాష్ట్రంలో ఐదు సంవత్సరాల పాటు అనేక సంక్షేమ పథకాలను ఎంతో సమర్థవంతంగా లబ్ధిదారులకు సకాలంలో అందజేశారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలతో విద్యకు పెద్దపీట వేశారు. క్రమం తప్పకుండా రైతు భరోసా సొమ్ము అందించి వ్యవ'సాయం' చేశారు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా ఇలా సమాజంలో అన్ని వర్గాల వారికి పలు సంక్షేమ పథకాలు అందించి నేనున్నానంటూ భరోసా కల్పించారు.


- అధికారం కోసం కూటమి నేతల **హామీలు**
- పీఠం ఎక్కాక మొహం చాటేస్తున్నారు
- చంద్రబాబు తీరుపై ప్రజల్లో వ్యతిరేకత

రాజమహేంద్రవరం రూరల్: అధికారంలో**కి రాగానే** సూపర్‌సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ..వాడా ప్రచారం చేశారు. ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సహాయం అన్నదాతా సుఖీభవ పథకం కింద అందజేస్తాం...ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15వేలు చొప్పున తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం...నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తాం...ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఖాతాలకు జమ చేస్తాం ...మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం.. అంటూ సూపర్ సిక్స్ పేరిట హామీలు తమ మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభమైంది. రైతుల పంటల సాగు పనుల్లో ఉన్నారు. అయినా వారికి సాయం ఇవ్వలేదు. ఇలా చెప్పిన ప్రతి పథకానికి ఇంతవరకూ అతీగతీ లేదు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ పక్కాగా అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వం ఇచ్చినట్లుగానే కచ్చితంగా హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.


18 సంవత్సరాలు నిండిన మహిళకు నెలకు రూ.1,500 సాయం



నియోజకవర్గం	లబ్ధిదారులు..
రాజమహేంద్రవరం సిటీ	: 1,11,648
రాజమహేంద్రవరం రూరల్	: 1,10,695



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం




నియోజకవర్గం	లబ్ధిదారులు..
రాజమహేంద్రవరం సిటీ	1,66,434
రాజమహేంద్రవరం రూరల్	1,67,773

ఏటా మూడు సిలిండర్లు ఉచితం



నియోజకవర్గం	లబ్ధిదారులు..
రాజమహేంద్రవరం సిటీ	1,90,500
రాజమహేంద్రవరం రూరల్	98,543




జగన్ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందిన సాయం

నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రాజమహేంద్రవరం రూరల్	10.23

కూటమి పాలనలో రైతులకు అందాల్సిన సాయం..

నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రాజమహేంద్రవరం రూరల్	15.62



జగన్ పాలనలో ఒక్కో ఏడాది తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
అమ్మఒడి	రాజమహేంద్రవరం సిటీ	38.15
	రాజమహేంద్రవరం రూరల్	35.40

కూటమి పాలనలో తల్లికి అందాల్సిన సాయం..

నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
రాజమహేంద్రవరం సిటీ	83.73
రూరల్	68.67

యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి..



నియోజకవర్గం	లబ్ధిదారులు..
రాజమహేంద్రవరం సిటీ	84,864
రాజమహేంద్రవరం రూరల్	68,640

పంట సాగుకు పెట్టుబడి ఎప్పుడిస్తారు?



ఖరీఫ్ పనులు ప్రారంభమై ఇప్పటికే రెండు నెలలు గడిచిపోయింది. రైతులందరూ అప్పులు చేసి సాగుకు పెట్టుబడులు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటికీ పెట్టుబడి సాయం గురించి మాట్లాడడం లేదు. గతంలో సీఎం జగన్ ఉన్నప్పుడు ఈ పాటికే రైతు భరోసా ఇచ్చారు. ప్రతి ఏటా చెప్పిన సమయానికి సాయం అందజేసి రైతులను ఆదుకున్నారు.

– కురుమళ్ల ఆంజనేయులు, హుకుంపేట

గ్యాస్ సిలిండర్లు ఏమయ్యాయి?



ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఏడాదికి ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి తరపున టీడీపీ, జనసేన పార్టీల అధినాయకులతో పాటు, ఇంటింటికీ తిరిగి లోకల్ లీడర్లు కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పుడేమో గ్యాస్ సిలిండర్లు త్వరలో ఇచ్చేస్తాం అంటూ కాలం గడిపేస్తున్నారు. గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నాం. అధికారంలోకి రాగానే ఇంతలా మోసం చేస్తారని అనుకోలేదు.

– పితాని కళ్యాణి, రాజవోలు

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు?



మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అని కూటమి అభ్యర్థులు ఎన్నికల వేళ ప్రచారం చేశారు. అధికారంలోకొచ్చి 100 రోజులు దాటినా దాని గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. ఉచిత బస్సు హామీ అమలవుతుందా? లేదా? ఒకవేళ చేయలేకపోతే హామీ ఎందుకు ఇవ్వాలి.

– సబ్బెళ్ల సింహాలక్ష్మి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక డిపోలో ఆర్టీసీ ఆఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) అజయ్‌బాబు, సుమారు 50 మంది ట్రాఫిక్ సిబ్బందితో కలిసి ట్రైనింగ్ కాలేజీ, డిస్పెన్సరీ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేశారు.

ఫ్రిజ్‌లు, వాటర్ డిస్పెన్సర్ల బహూకరణ



వాటర్ డిస్పెన్సర్‌ని బహూకరిస్తున్న సుబ్బారావు తదితరులు

సీటీఆర్ఐ: ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు తాగునీటి కోసం మూడు ఫ్రిజ్‌లు, రెండు వాటర్ డిస్పెన్సర్లను కేఎస్ఎల్ ఆసుపత్రి డైరెక్టర్ కీర్తి సుబ్బారావు బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా దాత సుబ్బారావుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీరామమూర్తి, డాక్టర్ పీవీ సంజీవరావు, కె.విశ్వేశ్వరరావు, కుసుమ గాంధీ, టీసీవై రత్నం తదితరులు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పర్యటన

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజులు పాటు రాజమహేంద్రవరంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి పర్యటించనున్నట్లు జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. పర్యటనలో భాగంగా ఆమె మహిళా జైలును సందర్శిస్తారన్నారు. అలాగే ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మహిళల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు.

కాలుష్య రహిత సమాజమే లక్ష్యం



జెండా ఊపి స్వచ్ఛతాహి సేవ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కాలుష్య రహిత సమాజమే లక్ష్యంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక వై జంక్షన్ నుంచి నందం గనిరాజు సెంటర్ వరకూ స్వచ్ఛతాహి సేవ ర్యాలీని కలెక్టర్ ప్రశాంతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం పరిశుభ్రంగా ఉంటేనే అభివృద్ధి, ఆరోగ్యం సాధ్యమన్నారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి వి.వెంకట్రాజు, ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు కార్యాచరణ

నిత్యావసర ధరల నియంత్రణకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో ధరల పర్యవేక్షణ, స్థిరీకరణ, నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో పండిస్తున్న కూరగాయలు, వస్తున్న ఉత్పత్తి వివరాలను నెల వారీగా సేకరించి అధ్యయనం చేయాలని ఆదేశించారు. దళారుల ప్రమేయాన్ని నియంత్రించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఆక్రమణల తొలగింపు షురూ



టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రధాన రహదారుల్లో ఉన్న అభ్యంతరకరమైన ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలంటూ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు బుధవారం రహదారులు, డ్రైన్లపై ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ 32వ డివిజన్ ఆజాద్ చౌక్ క్లాక్ టవర్ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకూ 26 డ్రైన్ ఆక్రమణలను, 15 రూఫ్ షెడ్‌లను, 2 తోపుడు బళ్లను గుర్తించి తొలగించామన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో చర్చించి, ఆక్రమణల తొలగింపునకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆక్రమణల తొలగింపు నిమిత్తం మూడు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు

కడియం: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు, క్రీడా ఎంపికలు స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ప్రారంభమయ్యాయి. హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడియం మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ హాజరై పోటీలను ప్రారంభించారు. 18వ తేదీన బాలురకు, 19న బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తారని పీడీ డేవిడ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 21వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురాం, కడియం మండల విద్యాశాఖాధికారి ఎంఎస్ మణికుమార్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ గారపాటి సత్య, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ ఎన్.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన సీట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2024–25 సంవత్సరానికి సంబంధించి మిగిలిన సీట్ల కోసం నాలుగో విడత అడ్మిషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ క్రిష్ణన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 26వ తేదీ రాత్రి 11.59 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 27వ తేదీన వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. పూర్తి వివరములకు 92940 50231, 78010 95303 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ సీబ్లాక్ వద్ద బుధవారం సుమారు 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం శాటిలైట్ సిటీ సీబ్లాక్ మూడో వీధి పంచాయతీ చెరువు స్థలంలో తెలుపు, పసుపు గళ్ల చొక్కా, గోధుమరంగు ప్యాంట్ వేసుకున్న వ్యక్తి శవం కుళ్లిపోయిన దశలో కనిపించింది. వీఆర్ఓ రత్నకుమారి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్ఐ అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను కార్మికులుగా మార్చడం చట్టరీత్యా నేరం

కంబాలచెరువు: పిల్లలను కార్మికులుగా మార్చడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్‌బాబు అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం కార్మిక శాఖ, ఇతర శాఖలతో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నుండి పద్నాలుగేళ్ల వయసున్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య రాజ్యాంగం కల్పించిన హక్కు అని చెప్పారు. సమావేశంలో రాజమహేంద్రవరం అడిషనల్ మున్సిపల్ కమిషనర్ పీఎం సత్యవేణి, జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



విజయవాడలో వరద బాధితులకు సాయం అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ వరద బాధితులకు చేంజింగ్ లైఫ్ ఫౌండేషన్ సభ్యులు బుధవారం సాయం అందజేశారు. వరద ప్రభావిత ప్రాంతాలైన పాయకపురం, కండ్రిక గ్రామాల్లో బాధితులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు, ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో మానవతా దృష్టితో ఒకరికొకరు సాయంగా నిలబడాలని ఫౌండేషన్ చైర్మన్ కె.సర్పన్‌రాజు అన్నారు. కార్యక్రమంలో పలువురు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిని ఒక లక్ష్యం పెట్టుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ శోభారాణి

సీటీఆర్ఐ: ప్రతి విద్యార్థిని జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకుని, దాన్ని సాధించే వరకూ విశ్రమించకూడదని రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. బుధవారం స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో ఫౌండేషన్ డే, ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులంతా తమ గమ్యాన్ని చేరుకోవడానికి అడ్డంకులు ఎదురైనా ఆగిపోకూడదన్నారు. అమ్మాయిలకు అబ్బాయిల కంటే మెచ్యూరిటీ ఉంటుందని వివరించారు. అనంతరం విద్యార్థినుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు, మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సునీత, అకాడమీ కోఆర్డినేటర్ పి.శ్రీవల్లి, కుసుమ కామేశ్వరి, దివ్యశ్రీ, భువన, శ్రీదేవి పాల్గొన్నారు.

జేసీబీతో చెత్త తొలగింపు

సాక్షి స్పందన



కడియపులంకలో వంతెనపై వేసిన చెత్తను తొలగిస్తున్న జేసీబీ

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కనే కోటిపల్లి కాలువ సమీపంలోని వంతెనపై చెత్తను వేస్తున్న విషయాన్ని సాక్షి బుధవారం సంచికలో 'చెత్తకుప్పలే స్వాగత ద్వారాలు' శీర్షికన వెలుగులోకి తెచ్చింది. దీంతో అధికారులు హుటాహుటీన జేసీబీని తీసుకొచ్చి వంతెనపై వేసిన చెత్తను పక్కకు తొలగించే పనులు బుధవారం చేపట్టారు. అలాగే వీరవరంలో సైతం చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు.

తపాలా ఉద్యోగుల నిరసన



హెడ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: ఆచరణ సాధ్యం కాని టార్గెట్లు, ఆన్‌లైన్ ట్రైనింగ్ కోర్సుల పేరుతో వేధింపులకు వ్యతిరేకంగా పోస్టల్ ఉద్యోగులు రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు రాజమండ్రి తపాలా పీ4 ఉద్యోగుల సంఘం కార్యదర్శి జేవీ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రెసిడెంట్ బీవీ రమణ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి టార్గెట్ల పేరుతో అధికారుల వేధింపులు వర్ణనాతీతమన్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న వేధింపులను భరించలేక అనేకమంది ఉద్యోగులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వేధింపులు మానుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తపాల సూపరింటెండెంట్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, ఈశ్వరరావు, మునేశ్వరరావు, స్వర్ణన్ రాజు, పుష్కరం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అడ్వాన్స్‌డ్ స్కిల్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో సమగ్ర శిక్ష అభియాన్ ఒకేషనల్ ఎడ్యుకేషన్‌పై శిక్షకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తునట్లు నేక్ సహాయ సంచాలకులు జున్నూరు రాజు తెలిపారు. నేక్‌లో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నేక్ ఏడీ జున్నూరు రాజు మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి 50 మంది ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనర్లు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ ఎస్తేరు రాణి, శిక్షణ సమన్వయకర్త సయ్యద్ అహ్మద్, శిక్షకులు పాల్గొన్నారు.

